బాధిత కుటుంబానికి పరామర్శ

మాజీ సర్పంచ్ కుమ్ర సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్, ఫిబ్రవరి 15 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమ్ర సావిత్రిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట సహకార సంఘం చైర్మన్ సురేశ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్ దేవ్, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్, రూప్‌దేవ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నాగోరావ్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తాంసి, ఫిబ్రవరి 15: ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గ్రామ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్లు అభిలాష్, పల్లవి మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రసాద్, సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల కందులు కొనుగోలు చేయాలి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 15: ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు కోట ఎకరానికి 3 క్వింటాళ్లు ఉందని, ఎకరానికి ఎనిమిది క్వింటాళ్లకు పెంచి కొనుగోలు చేయాలని ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్ మార్క్‌ఫెడ్ అధికారులను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయానికి వెళ్లి అక్కడ అందుబాటులో ఉన్న సిబ్బందిని కలిసి వినతిపత్రం అందజేశారు.

PUBLIC NOTICE

Under instructions of A.Sainath Goud S/o. Hanma Goud R/o. Bhainsa Dist. Nirmal, I hereby Issue the Notice to the Public as follows

That the above said Sri.A.Sainath Goud S/o. Hanma Goud derivied title to the RCC Mulgi bearing Municipal Door No.4-3-71/8 (PTIN No.1096013173) in Sy.No.342/1A situated at Gandhi Gunj, Bhainsa Dist. Nirmal through the Regd. Sale Deed No. 50/1977 Dated: 21-01-1977 of SRO Bhainsa (in Urdu language). That due to inadvertence the said original registered sale deed was laminated to protect the document. That the said document is proposed to be deposited with the S.B.I. Br. Nirmal Road Bhainsa alongwith other documents to avail the loan by deposting the laminated original document with the bank and to create Equitable Mortgage of said property in favour of the bank. That the proposed mortgagor A.Sainath Goud is the exclusive owner of the said property. declared that the laminated document No. 50/1977 Dated: 21-01-1977 of SRO Bhainsa is original document.That if any persons have any claim towards the said relevant property can intimate the S.B.I. br. Nirmal Road Bhainsa within (15) days from the days of this publication of notice.

That the said laminated document can be accepted, no body will have any right or title over the said property, which is offered as security to the bank.

Hence Public Notice.

Date: 15-02-2025

Sd/- G.RAMESH, B.Sc., LLB, Advocate
Behind Nataraj Theatre Lane, Near to Bhainsa Road, Nirmal, Dist. Nirmal.T.S
Cell: 9959043005

CHANGE OF NAME

By this deed I, The under signed **SHAIK ALI BABA S/o. HASSAN ALI** R/o. H.No. 1-2-19/A6, Street: Edigaon, Mdl: Nirmal Urban, Dist. Nirmal, State: Telangana have changed my name to **SHAIK ALI S/o. HASSAN ALI** For all Future Purpose.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకే వాహనాలు

ఫైర్ స్టేషన్‌కు బస్సు ట్రాక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేశ్ కుమార్

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : విపత్తు సమయంలో త్వరగా బాధితులను సురక్షితంగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు గాను ఆదిలాబాద్ ఫైర్ స్టేషన్‌కు ఒక బస్సు, ట్రాక్ మంజూరైందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేశ్ కుమార్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లో వాహనాన్ని జిల్లా అగ్రిమాపక శాఖ అధికారి సురేశ్ కుమార్ ప్రారంభించారు. వాటి పని తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ విపత్తు సమయంలో సామగ్రితో పాటు ఇతర వస్తువులను తరలించడానికి రాష్ట్ర వ్యాప్తంగా వాహనాలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ ఫైర్ స్టేషన్‌కు ఒక బస్సుతో పాటు ట్రక్కు కూడా వచ్చిందన్నారు. ఇప్పటికే ఫైర్, పోలీసు శాఖలోని సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎలాంటి ప్రమాదం జరిగిన వెంటనే స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జబ్రీం, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ధీటైన నాయకులు లేరు

మొక్క నాటుతున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఉట్నూర్, ఫిబ్రవరి 15: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధీటైన నాయకులు లేరని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఆయన ఇంటి ఆవరణలో కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌తోనే తెలంగాణను సాధించామన్నారు. నేడు మళ్లీ ఆయనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నర్సరీలో అన్ని రకాల మొక్కలు పెంచాలి

నర్సరీని పరిశీలిస్తున్న నిర్మల్ జిల్లా స్పెషల్ పార్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో చోలే అనిత

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 15: అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నర్సరీలో అన్ని రకాల మొక్కలు పెంచాలని నిర్మల్ జిల్లా స్పెషల్ పార్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో చోలే అనిత అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని అటవీ శాఖ కార్యాలయంతో పాటు నర్సరీని సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎఫ్ఆర్వో సంతోష్, ఎఫ్ఎస్‌వో రాజేందర్, ఎఫ్‌బీవో నిశాంత్, సిబ్బంది సంజీవ్ ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

నిర్మల్‌అర్బన్: మాట్లాడుతున్న ఆర్ఎం సులోమాన్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 15: ప్రయాణికులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఆదిలాబాద్ ఆర్ఎం సులోమాన్ అన్నారు. శనివారం నిర్మల్ బస్టాండ్‌లో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై డిజిటల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, నవీన్ కుమార్, ఏఆర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఉట్నూర్, ఫిబ్రవరి 15: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ఉట్నూర్ డిపో సూపరింటెండెంట్ శకుంతల అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, నడిచే బస్సులలో నుంచి దిగరాదని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

17న రక్తదాన శిబిరం

బోథ్, ఫిబ్రవరి 15: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నేరడిగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ డీ నారాయణ రెడ్డి తెలిపారు. బోథ్, సొనాల మండలాల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. 33 జీపీల పరిధిలో ఒక్కో జీపీ నుంచి పది మంది చొప్పున రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జన్మదినోత్సవ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

శిక్షణ శిబిరం ప్రారంభం

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : స్వయం ఉపాధిలో రాణించేలా అందిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రముఖ న్యాయవాది మహ్మద్ గౌస్ అన్నారు. ఆదిలాబాద్‌లో ఉర్దూ భవన కమిటీ ఆధ్వర్యంలో మహిళలు, యువతుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్, మగ్గం, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎండబ్ల్యూవో ప్రధాన కార్యదర్శి ఖలీల్, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్ఫాలాఖాన్, నూర్‌ఖాన్, ఉర్దూ భవన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, అబ్దుల్ రజక్, రఫీక్, ఫయాజ్ అహ్మద్ షా, భీంఆర్మీ అధ్యక్షుడు షకీల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి పరామర్శ

తాంసి, ఫిబ్రవరి 15: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు కీర్తి హరివర్ధన్ తండ్రి నారాయణ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. శనివారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు మహేందర్, అశోక్, ఆనంద్, రమణ, రవీందర్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే రాయిసెంటర్‌కు ఫిర్యాదు చేయాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి 15: ఆర్టీఐ పేరిట వ్యక్తిగత అవసరాలకు ఇచ్చోడలో ఇంటి నిర్మాణాలపై నోటీసులు ఇచ్చి అక్రమ వసూళ్లకు పాల్పడితే రాయిసెంటర్‌కు ఫిర్యాదు చేయాలని తుడుందెబ్బ నాయకుడు కొడప నగేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్ మేడిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలపై తగు నిర్ణయాలు తీసుకున్నారు. గిరిజనేతరుల ఆస్తుల జోలికి వెళ్లమని, గిరిజనేతరులకు తాము వ్యతిరేకం కాదన్నారు. సమావేశంలో సార్‌మేడి మెస్రం శంభు, ఉప సార్‌మేడి కుమ్రం జ్యోతిరాం, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ తులసీరాం, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డు పాలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 15 : ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణితోనే సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, గాందారి రత్నం అన్నారు. మెదక్ జిల్లా చేగుంటలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీఆర్పీలు రోడ్డు ప్రమాదంలో మరణించినందున నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ విజిలెన్స్ అధికారి

బాసర, ఫిబ్రవరి 15 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారిని శనివారం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ విజిలెన్స్ అధికారి నిఖిల్‌కుమార్ కనోడియా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనను అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ఆలయ అర్చకులు అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

మానసిక ఒత్తిడికి గురవుతున్నాం..

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : గత కొంతకాలంగా జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల పైన జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల పని ఒత్తిడి వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరమ్‌సింగ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లో డీఈవో ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా చేగుంటలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీఆర్పీలు విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇటువంటి సంఘటనలు ఆదిలాబాద్ జిల్లాలో జరగకుండా ప్రతి సమగ్ర శిక్ష ఉద్యోగి స్వేచ్ఛగా పని చేసుకునే విధంగా ఉండాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ పేస్కేల్, హెల్త్ కార్డులు, జీవిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎన్‌సీసీ కెడెట్లకు సీ గ్రేడ్ పరీక్ష

ఎదులాపురం, ఫిబ్రవరి 15: ఆదిలాబాద్‌లోని డిగ్రీ సైన్స్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ కెడెట్లకు సీ గ్రేడ్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా కెడెట్లకు ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. మొత్తం 161 మంది కెడెట్లు హాజరు కాగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 16వ తేదీన స్థానిక ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కల్నల్ మధుసూదన్ రావ్, కెప్టెన్ జగ్రామ్, అశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

బోథ్, ఫిబ్రవరి 15: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని పార్డి(బీ) రాయిసెంటర్‌లో ఆదివారం నుంచి ఆదివాసీ గిరిజన యువతీ, యువకులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ధాత్రి ట్రస్ట్ కోఆర్డినేటర్ సిడాం గణపతి తెలిపారు. శనివారం సొనాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ హక్కులు, విద్య, పేసా చట్టంపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే వారికి భోజన వసతి కల్పించినట్లు పేర్కొన్నారు. ఆదివాసీ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో గణపతి, హేమంత్, అరవింద్, మెస్రం భూమన్న, రాయిసెంటర్ గీతదార్, గంగాధర్, భగవాన్, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి

ఇచ్చోడ: ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 15: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం సేవాలాల్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. బంజారాల సాంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి భోగ్ సమర్పించారు. సేవాలాల్ జయంతి సందర్భంగా నూతన జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, బంజారా సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తలమడుగు, ఫిబ్రవరి 15: ఆదిలాబాద్ జిల్లా తలమడుగులోనా శ్రీ అలివేలు మంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హాజరయ్యారు. నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ధ్వజస్థంభ దాత కాటిపల్లి వెంకటమ్మ వసంత్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి ఆలయ వారోత్సవాల సందర్భంగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, సంజీవ్ రెడ్డి, వసంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,సభ్యులు పాల్గొన్నారు.

సేవతోనే సమాజంలో గుర్తింపు

మాట్లాడుతున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసాటౌన్, ఫిబ్రవరి 15 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని చుచుంద్ గ్రామంలో దివ్యాంగులైన ఇద్దరు పిల్లలు కలిగిన వితంతువు తాడొల్ల యోగిత కుటుంబానికి దివ్యాంగ శక్తి ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన నూతన గృహాన్ని శనివారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. నిరుపేద కుటుంబ గృహ నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. దివ్యాంగులకు అన్ని రకాలుగా సహకరిస్తామని, సేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సేవ గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో మోజం హుస్సేన్, కార్యదర్శి శ్రీధర్, ఫౌండేషన్ చైర్మన్ మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు



ర్యాలీ తీస్తున్న బంజారా నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి 15: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో శనివారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వినాయక్ చౌక్ నుంచి సేవాలాల్ స్థలం వరకు నృత్యాలు చేస్తూ యువకులు ర్యాలీ తీశారు. అనంతరం జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలన్నారు. వచ్చే నెల 24న జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానంలో అధికారికంగా నిర్వహిస్తున్నందున బంజారా సోదరులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీమంత్రి అమర్‌సింగ్ తిలావత్, భరత్ చౌహాన్, జగన్, సుమన్‌బాయి, భీంరావ్ నాయక్, గంగారాం నాయక్, రాందాస్ నాయక్, సేవాలాల్ ధర్మ ప్రచారక్ ప్రేమ్ మహారాజ్, దేవీదాస్, బానోత్ రామారావ్, రాంకిషన్ నాయక్, మహేందర్, చంద్రకాంత్, గడ్డం ప్రకాశ్, శ్రీరాంనాయక్, మధుకర్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 15: లక్ష్మణచాందతో పాటు తిర్‌పల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ధ్వంసమైన, వంగిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను అమర్చి తీగల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యుత్ మోటర్ల తీగలు చోరీ

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 15: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్, బాదనకుర్తి గ్రామాల్లోని గోదావరి నది పరివాహక ప్రాంత రైతుల విద్యుత్ మోటర్ల తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామలకు చెందిన తుప్ప రాజేందర్, అంబటి గంగారెడ్డి, పార్శపు నర్సయ్య, కుమ్మరి శ్రీనివాస్, చిలుకురి వెంకట్రాములు, మొగిలి భీమేశ్, వెంకట్రాజం, మాసుల లక్ష్మిలకు చెందిన విద్యుత్ మోటర్లను విద్యుత్ సరఫరా ఉండగానే గురువారం రాత్రి దొంగలించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

కోతుల దాడిలో బాలుడికి గాయాలు

ఖానాపూర్ టౌన్, ఫిబ్రవరి 16: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో కోతులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. శనివారం పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం కాలనీలో శ్రీజు అనే బాలుడిపై కోతులు దాడి చేసి గాయపర్చాయి. చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతులను బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టపగలు చోరీ

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 15: నిర్మల్‌లో పట్టపగలే దొంగతనం జరిగిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల చౌరస్తాలోని ఓ బేకరి దగ్గర పట్టణానికి చెందిన జంగయ్య వెళ్తుండగా అతని వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి కవర్ లాక్కొని వెళ్లాడు.అందులో రూ. 50 వేల నగదు ఉందని బాధితుడు తెలిపాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాలను పరిశీలించారు. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని కాపాడిన స్థానికులు

బాసర, ఫిబ్రవరి 15 : నిర్మల్ జిల్లా బాసర గోదావరి వద్ద శనివారం ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు కాపాడారు. వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన గంగాధర్ గోదావరిలో దూకేందుకు ప్రయత్నించాడు. నిజామాబాద్ యంచా గ్రామానికి చెందిన కవిన్‌ధర కిశోర్ చాకచాక్యంగా పట్టుకొని గంగాధర్‌ను కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని గంగాధర్‌ను విచారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నిండు జీవితాన్ని కాపాడిన కిశోర్‌ను పలువురు అభినందించారు.

ముగిసిన ధృవపత్రాల పరిశీలన

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 15: డీఎస్సీ 2008 అభ్యర్థులకు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ధృవపత్రాల పరిశీలన ప్రశాంతంగా ముగిసిందని డీఈవో రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 20 మంది అభ్యర్థులు ఎంపిక కాగా 17 మంది అభ్యర్థులు ధృవపత్రాల పరిశీలనకు హాజరయ్యారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఖాళీల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించామని, ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సూపరింటెండెంట్ వెంకటరమణ, శ్రావణి, ప్రవీణ్, నర్సయ్య, శేక్ హుస్సేన్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 15 : గుడిహత్నూర్ మండలంలోని కొలాంగూడ గ్రామంలో హనుమాన్ మందిరం రెండవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను శనివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుణవంత్‌రావ్, రాథోడ్ ప్రతాప్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బోథ్ వీడీసీ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

ఎన్నికైన అడ్‌హక్ కమిటీ సభ్యులు

బోథ్, ఫిబ్రవరి 15: బోథ్ గ్రామాభివృద్ధి నూతన కమిటీ ఎన్నిక కోసం శనివారం ఎన్నికల అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికలు పూర్తయి కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకరించే వరకు అడ్‌హక్ కమిటీ పని చేయనుంది. అడ్‌హక్ కమిటీ సభ్యులు పుండ్రు దివాకర్ రెడ్డి, మంచికుంట మురళీధర్, షేక్ అబుద్, మాసం అనిల్‌కుమార్, మల్లెపూల శివారెడ్డి, రావుల గణపతి ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు 15 రోజుల్లోగా కుల సంఘాల నుంచి ఇద్దరు సభ్యుల పేర్లు సేకరించనున్నారు. సమావేశంలో మాజీ అధ్యక్షులు గంగాధర్, భోజన్న, రాము, నల్ల గంగయ్య, వడ్ల చందు, కొట్టాల రమేశ్ రెడ్డి, కరిపే శ్రీనివాస్, భోజన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

భార్యను చితకబాదిన భర్త

ఎదులాపురం, ఫిబ్రవరి 15: దొంగి బాబా తాయిత్తు ఇచ్చినందుకు ఇంట్లో గొడవలు వస్తువులు పగలగొట్టడంతో పాటు భార్యను చితకబాదిన ఘటన ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌లో చోటు చేసుకుంది. మహారాష్ట్రకు, తాత్కాలికంగా నివాసం బంగారిగూడకు చెందిన యాసిన్ అలియాస్ (జనాభా) దొంగిబాబా గత నెలలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం సమీపంలో ఖుర్షిద్‌నగర్‌కు చెందిన షేక్ హజారుద్దీన్‌ను కలిశాడు. తాయిత్తు తీసుకుంటే అంత శుభం జరుగుతుందని మాయ మాటలు చెప్పి హజారుద్దీన్ నుంచి రూ.5600 తీసుకున్నాడు. 45 రోజులు తాయిత్తు నువ్వు పడుకునే దిండు కింద ఉంచమని చెబుతాడు. అలా పెట్టిన కొద్ది రోజుల తర్వాత ఇంట్లో తల్లితో గొడవలు చేయడంతో పాటు ఇంట్లో ఉన్న టీవీ, వాషింగ్ మిషన్ ధ్వంసం చేశాడు. అడ్డు వచ్చిన భార్యను సైతం చితకబాదాడు. షేక్ హజారుద్దీన్ మతిస్థిమితం కోల్పోయి ఏమి చేస్తున్నాడో అతనికి తెలియకుండానే జరిగిపోతుందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా మాయ మాటలు చెప్పి యాసిన్ అలియాస్ (జనాభా) దొంగి బాబాపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి రిమాండ్



మాట్లాడుతున్న దిలావర్‌పూర్ ఎస్ఐ సందీప్

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 15: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన కేసుల్లో ఇద్దరిని పట్టుకొని జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ సందీప్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 12వ తేదీన అదే గ్రామానికి చెందిన సంగెపు సాయన్న, మరో గ్రామానికి చెందిన బోసు సాగర్ కలిసి తాళం వేసిన ఇంట్లో నుంచి బంగారం, నగదును దొంగలించిన కేసులో అరెస్ట్ చేసి నిందితులను జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దొంగతనం చేసిన వారి నుంచి నగదు, బంగారంను రికవరీ చేసినట్లు ఆయన సూచించారు. మూడు రోజుల వ్యవధిలోనే దొంగలను పట్టుకొని రిమాండ్‌కు పంపినందుకు గాను నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అభినందినట్లు ఆయన తెలిపారు.